# నా మొదటి నవల

నా చిన్న తనంలో నే నొక నవల వ్రాశాను. నవల వ్రాయడానికి తగినంత శక్తి సామర్థ్యాలు నాకు అప్పట్లో లేవు. అయినా వ్రాయక తప్పింది కాదు. దానికి దీపావళితో సంబంధం ఉంది. అదే చెబుతాను.

చిన్నతనంలో గోరంత విషయమైనా కొండంతగా కనపడుతుంది. ప్రేమ, ఆదరము, సానుభూతి ఏ కొంచెమైనా చూపినవారు కథల్లో మహాకార్యాలు నిర్వహించే రాజకుమారుల్లా కనపడతారు. నిర్దాక్షిణ్యం, క్రౌర్యం చూపేవారు రాక్షసులనిపిస్తారు. అలాంటి దుర్మార్గుల్ని అథఃపాతాళ లోకానికి అణిచి వేద్దామనిపిస్తుంది. కాని దానికి తగినంత శక్తి లోపిస్తుంది. అప్పుడు ప్రతీకారం తీర్చుకోడానికి, కోపం ప్రదర్శించడానికి మార్గాంతరం అన్వేషించ వలసి వస్తుంది. అలాంటి ఘట్టమే నా జీవితంలో కూడా ఉంది.

హైస్కూల్లో నాలుగవ ఫారమ్ చదువుకుంటున్నాను. మాది పల్లెటూరు. అక్కడికి పదిహేను మైళ్ళ దూరంలో ఉన్న మరొక ఊళ్ళో హైస్కూలు ఉంది. అది పట్టణమూ కాదు, పల్లే కాదు. నగరాల్లోనే పుట్టి అక్కడే చదువుకునే పిల్లలకు, పల్లెటూళ్ళకు చెందిన పిల్లలకు, ఒకటే భేదం ఉంది. నగరాల్లో పిల్లలకు పుట్టుకతోనే నాగరికత అబ్బుతుంది. చదువుకుంటూ ఉన్నప్పటికీ పల్లెటూరి పిల్లలకు పల్లెటూరి తనం పోదు. నా విషయంలో కూడా అంతే.

ఆ ఏడాది దీపావళి వచ్చింది. దీపావళికి పదిరోజులు ముందే మా తాతయ్యను పీడించి, అనారోగ్య కారణాలపై సెలవుతీసుకున్నాను. దీపావళిసరకులుకాల్చుకోడంలోమూడు ప్రధానమైన దశలు ఉన్నాయి. మొదటిది- తల్లి, అమ్మమ్మ, బామ్మ, అక్కయ్య వగైరా అందరూ చెయ్యిపట్టుకుని తాటాకు టపాకాయలు, కాకర పువ్వొత్తులు, మతాబులు మతాబులు కాల్పించే బాల్యదశ (ఇన్ ఫెంట్ క్లాస్). రెండవది- కొంచెం స్వతంత్రించి అరుగు దిగి, తిప్పుడు పొట్లాలు త్రిప్పుకుంటూ, రోలు రోకలి పేల్చుకుంటూ, కొంచెం పెద్ద మనిషి తరహాగా చిచ్చుబుడ్లు వెలిగిస్తూ బాల్యదశను ఏవగించుకుని, ఆఖరి దశలో ప్రవేశించడం ఎప్పుడా అని ఉవ్విళ్ళూరే మధ్యదశ (మిడిల్ స్కూల్ దశ). మూడవది- ఇల్లు, వీధి, ఊరు కూడా విడిచి గుంపులు గుంపులుగా ఏ ఆటల మైదానానికో, చెరువుగట్టుకో, కాలవ గట్టుకో పోయి- తూటాలు, తారాజువ్వలు, పిచ్చుకలు, వెలక్కాయలతో హోరా హోరి యుద్ధాలుచేసే ఆఖరిదశ (కాలేజి దశ. పల్లెటూరివారికి హైస్కూల్ దశ). (నేను అప్పుడప్పుడే ఈ మహోన్నతమైన ఆఖరిదశలో ప్రవేశించాను. సరంజామా తయారు చేసుకోవడంకోసం వ్యవధి కావలసివచ్చింది. అందువల్లనే సెలవుపెట్టాను. మా వీధిలో కొంతమంది కుర్రవాళ్ళం పోగై తూటాలు, తారాజువ్వలు కట్టాము. మా యిళ్ళల్లో మధ్యదశలోని పిల్లలకు తిప్పుడు పొట్లాలు కట్టి యిచ్చారు.

నాడు నరక చతుర్దశి కూడా బాణాసంచా తయారు చేయడంలోనే గడిపాము. దీపావళినాడు అదృష్టవశాత్తూ

ఎండ బాగా కాసింది. సరకులన్నీ ఎండబెట్టాం. ఊళ్లో మా తూటాలకు ఎక్కువ ప్రసిద్ధి ఉంది. అవి తిరిగినంత అయో మయంగా.(చూచేవారికి) చురుకుగా మరెవరుకట్టిన తూటాలు తిరగలేవు. జువ్వలసంగతికూడా అంతంతమాత్రమే సరా సరి నక్షత్ర మండలంలోకి, మేము కోరుకుంటే మాకు ఇష్టం లేని ప్రతి ఇంటిమీందికి దాడిచేయవలసిందే! చెరువుగట్టుమీద తూట లతో ఇతరజట్లమీద యుద్ధం చేయడానికి ఏర్పాట్లు చేసుకున్నాము. సాయంత్రం చీకటిపడిన తరువాత పూజలు ముగిశాయి. భోజనాలు, ప్రసాదాలు ముగించుకుని బాణ సంచా తీసుకొని చెరువుగట్టు చేరుకున్నాము చేరుకుంటూనే జట్లు జట్లుగా ఏర్పడి తూటాలు, జువ్వలు కాల్చటం ప్రారం చాము. మా జట్టుకు నేను నాయకుణ్ణి. అందుకని మా అస్త్రాలన్నీ నా వద్దనే ఉన్నాయి.

అయితే ఆ ఏడాది మా ఏర్పాట్లన్నీ అనుకోనివిధంగా తలక్రిందులైనాయి. అదే చెరువుగట్టుమీద రూరల్ డిస్పె న్సరీ వుంది. డాక్టరుగారు కోపిష్ఠి. తొందరపాటు ఎక్కువ. అసలే కోతి...వంటివాడు. కొత్తగా పెళ్ళయింది. డిస్పెన్సరీ ముందుగదిలో పెట్రోమాక్సులైటు పెట్టుకుని భార్యతో కారమ్సు ఆడుతున్నాడు. డిస్పెన్సరీ గుమ్మం బార్లా తీసి ఉంది. ఆయన నివాసంకూడా డిస్పెన్సరీలోనే.

నేను వేసిన తూటా ఒకటి ఎలా వెళ్ళిందో సావిట్లో ప్రవేశించి, డాక్టరుగారి బుర్రచుట్టూ ప్రదక్షిణంచేసి, ఝుంయ్యుమని ఆయన భార్య చీరచెరగులో దూరింది. వెంటనే దాని భరతం పట్టారు. ఆయన ప్రళయ కాల

రుద్రుడై పోయాడు. భార్యచేత కాల్పించడానికి ఊళ్ళో దుకాణంలో కొన్న అరడజన్ చిచ్చుబుడ్లలో ఒకటి తీసి, అది వెలిగించి, నా మీద దాడి చేశాడు. అంతవరకు డాక్టరు గారింట్లో తమాషా చూస్తున్న నేను ఆయన కేకలు విని, నిలబడితే మర్యాద దక్కదని పరుగు ప్రారంభించాను. ఆయన ఇక నన్ను తరిమి పట్టుకోలేక ఆ వెలుగుతున్న చిచ్చుబుడ్డి విసిరి కొట్టాడు. అది నా వీపుమీద బద్దలైంది. వీపు అక్కడా అక్కడా కాలింది. నేను మరెక్కడా ఆగకుండా ఇల్లు చేరుకున్నాను.

నేను పారిపోవడంతో నా జట్టు ఓడిపోయింది. నా దగ్గర ఉన్న తూటాలు, జువ్వలు ఆ చీకటిలో క్రిందపడి పోయాయి. వాటిని ఎవరో చేజిక్కించుకుని హాయిగా కాల్చుకుని ఉంటారు.

మా సరదా అంతా మంట గలిపిన ఆ డాక్టరుమీద ఎలాగైనా పగతీర్చుకోడానికి ఆలోచించాను. వీపు కాల్చినందుకైనా తగిన శిక్ష విధించాలనే నిశ్చయానికి వచ్చాను. చాలా ఉపాయాలే తట్టాయి. వాటిలో ఒకటి మా పాలేరుకు నాలుగణాలిచ్చి డాక్టర్ని కొట్టించడము. కాని అవేవి నాకు రుచించలేదు. ఇతరులద్వారా పగదీర్చుకోవడం చేతకాని తనం అనిపించుకుంటుంది. దానివల్ల సంతోషమేమీ కలుగదు. డాక్టర్ని స్వయంగా కొట్టి తిట్టడానికి తగినంత బలం లేదాయె. ఇతరవిధాలుగా ఆయనమీద పగతీర్చుకుంటే ఊళ్ళోవాళ్ళు, మావాళ్ళు కూడా నన్ను బతకనివ్వరు. ఊళ్ళో అందరికి ఆయన వైద్యుడు. అప్పుడు తట్టింది నవల

వ్రాద్దామని. ఇంత మహాకోపం తీర్చుకోడానికి ఒ కథో గిథో అయితే ఏం సరిపోతుంది?

అనుకోవడమేమిటి, వ్రాసెయ్యడమేమిటి? ఆ నవలలో కథానాయకురాలు ప్రేమలత అనే అపూయిక బాలిక. పరమ సౌందర్యఖని. కథానాయకురాల్ని హింసించి, తన వల్లో వేసుకుని పెళ్ళి చేసుకోడానికి ప్రయత్నించిన దుర్మార్గుడు డాక్టర్ ఘోష్ (డాక్టరు అసలు పేరు పనికిరాదని బెంగాలీ పేరు పెట్టాను. అది ఒక బెంగాలి డిటెక్టివ్ కథలో ఒక హంతకుడి పేరు) ప్రపంచంలో ఉన్న దుర్మార్గపు లక్షణాలన్నీ ఆ డాక్టరుకు కట్టబెట్టాను. డాక్టరు వలలోంచి ఆ బాలికను రక్షించి, వివాహం చేసుకున్నది నేను. ఆ విధంగా డాక్టర్‌ను భంగపరిచి, పగతీర్చుకున్నాను.

ఈ కథకు తలవని తలంపుగా మరొకరకమైన పరిణామం సంభవించింది. ఆ తరువాత తరువాత మా ఊళ్ళో డాక్టరుకు నాకు స్నేహం కలిసింది. ఆ తరువాత నా విషయంలో అతను ఎంతో మంచివాడయ్యాడు. అందుచేత ఆ నవల అచ్చువేయించడం స్నేహితుడికి అపచారం చేసినట్లవుతుందని దాన్ని చింపి పారేశాను. అదిగో ఆ విధంగా నేను సాహిత్య ప్రపంచంలో అడుగు పెట్టడానికి ఒకరకంగా దీపావళి కారణమైంది.